


## డీసీకి ఫొటో ఫ్రేమ్ అందజేత

దేవాదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, భద్రకాళి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రామల సునితను సోమవారం వరంగల్ వాయిస్ దిన పత్రిక ఎడిటర్ గడ్డం కేశవమూర్తి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెపై ప్రచురితమైన సక్సెస్ స్టోరీకి చెందిన ఫొటో ఫ్రేమ్ ను అందించారు.

*–వరంగల్ వాయిస్, వరంగల్*


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 068
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
ఫిబ్రవరి 23, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

# సిగ్నల్ జంప్‌లపై.. సీరియస్


- ఒక్కో జంప్ కు రూ.1,050 జరిమానా
- ఆటోమేటిక్ గా యజమాని ఖాతా నుంచే కట్
- అశోక టాకీస్ జంక్షన్‌లో అధునాతన కెమెరాల ఏర్పాటు
- ట్రాఫిక్ నియమాలపై కఠిన చర్యలు

ఆటో, బస్సు, ఇతర వాణిజ్య వాహన డ్రైవర్లు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను కచ్చితంగా పాటించాల్సిందే. కాదు.. కూడదంటే మీకు తెలియకుండానే మీ బ్యాంక్ అకౌంట్ నుంచి ఆటోమేటిక్ గా డబ్బుల్ కట్ అవుతాయి జాగ్రత్త అంటున్నారు హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు. గతంలో మాదిరిగా ఫొటోలు తీసి చాలన్ లు పంపే పద్ధతికి స్వస్తి పలికినట్లు వారు వెల్లడిస్తున్నారు. ఇకపై సిగ్నల్ జంప్ చేసినట్లయితే రూ. 1,050 జరిమానా నేరుగా సంబంధిత వాహన యజమాని బ్యాంక్ ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా కట్ అవుతాయని హెచ్చరిస్తున్నారు. ఇందుకుగాను హనుమకొండలోని అశోక టాకీస్ జంక్షన్‌లో అత్యాధునికమైన ఆటోమేటిక్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. ఈ కెమెరాలు సిగ్నల్ ఉల్లంఘనలను స్వయంచాలకంగా గుర్తించి, నియమాలు అతిక్రమించిన వాహనదారులకు వెంటనే జరిమానా విధించే విధంగా పనిచేయనున్నాయి. ఈ కెమెరాలు ఈ రోజు నుంచే అంటే 23 ఫిబ్రవరి 2026 సోమవారం నుంచే పని చేయడం ప్రారంభించాయి. ఒకపై గీత దాటితే వేటు పడడం గ్యారంటీగా మారింది. వాహనదారుల్లో ట్రాఫిక్ క్రమశిక్షణను పెంపొందించడం ద్వారా ప్రమాదాలను తగ్గించడంతోపాటు ట్రాఫిక్ నియంత్రణను కట్టుదిట్టం చేయడానికి హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. – వరంగల్ వాయిస్ ప్రతినిధి



## కుడా వసూళ్లకు బ్రేక్..

- భద్రకాళి వాకర్లకు ఉచిత ప్రవేశం
- హామీ ఇచ్చిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



2లో..



8లో..

## రోడ్డు ప్రమాదాల్లో యువతను కోల్పోతున్నాం

- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్
- క్రీడల్లో రాణించిన పోలీస్ క్రీడాకారులకు ఘన సన్మానం



8లో..

## ఖాసీం రజ్వీని తలపిస్తున్న రేవంత్ రెడ్డి

- రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోంది
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- అండర్ బ్రిడ్జి ప్రాంతంలో సీఎం దిష్టిబొమ్మ దహనం



# కుడా వసూళ్లకు బ్రేక్..

- భద్రకాళి వాకర్లకు ఉచిత ప్రవేశం
- హామీ ఇచ్చిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆరోగ్య పరిరక్షణ కోసం భద్రకాళి ట్యాంక్ బండ్‌పై ఉదయం పూట నడక (వాకింగ్) సాగించే నగరవాసులకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) సిబ్బంది కలిగిస్తున్న ఇబ్బందులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చెక్ పెట్టారు. ఎంట్రీ ఫీజుల పేరుతో కుడా సిబ్బంది గత కొన్ని రోజులుగా చేస్తున్న వసూళ్లపై ఆయన సీరియస్ అయ్యారు. ఉదయం ఏడు గంటల వరకు వాకర్ల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయవద్దని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించి వాకర్లకు బాసటగా నిలిచారు. సోమవారం ఉదయం భద్రకాళి వాకర్ల బృందం ఎమ్మెల్యేను నాయిని రాజేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యను విన్నవించగా ఆయన తక్షణమే స్పందించారు.

### నాడు ఏజెన్సీ.. నేడు 'కుడా' సిబ్బంది

గడచిన 20 సంవత్సరాలుగా భద్రకాళి బండ్ పరిసరాలు వరంగల్ నగరవాసుల దినచర్యలో భాగమయ్యాయి. రోజూ ఉదయం వందలాది మంది ఇక్కడ నడక, వ్యాయామాలు చేస్తుంటారు. అయితే, ఆరు నెలల క్రితం బండ్ నిర్వహణ చూసుకుంటున్న ప్రైవేట్ ఏజెన్సీ వారు వాకర్ల నుంచి డబ్బులు వసూలు చేయాలని చూడటంతో వివాదం తలెత్తింది. ఆ సమయంలో వాకర్లు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టగా.. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జోక్యం చేసుకుని, ఉదయం ఏడు గంటల వరకు వాకర్లకు ఉచిత ప్రవేశం కల్పించారు. తాజాగా సదరు ప్రైవేట్ ఏజెన్సీ కాంట్రాక్ట్ గడువు ముగియడంతో, భద్రకాళి బండ్ నిర్వహణను 'కుడా' తమ ఆధీనంలోకి తీసుకుంది. అయితే, గత వారం రోజులుగా కుడా సిబ్బంది మళ్లీ పాత పాటే పాడుతున్నారు. తెల్లవారుజామున వాకింగ్‌కు వచ్చే వారిని సైతం డబ్బులు అడగడం మొదలుపెట్టారు. దీంతో తీవ్ర అసహనానికి గురైన భద్రకాళి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఏకమై సోమవారం నేరుగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వద్దకు వెళ్లి తమ గోడును వెళ్లబోసుకున్నారు.

### ఎక్కడ లేని నిబంధనలు..

ఈ సందర్భంగా వాకర్లు పలు కీలక అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. 'పచ్చని వాతావరణంలో ఆహ్లాదం, ఆరోగ్య పరిరక్షణ కోసమే పార్కులను ఏర్పాటు చేస్తారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లాంటి మహానగరాల్లోని అతిపెద్ద పార్కులలో సైతం ఉదయం పూట నడక కోసం వచ్చే వాకర్స్ నుంచి ఎక్కడా డబ్బులు వసూలు చేయడం లేదు. ఇక్కడ కూడా ఉదయం ఏడు గంటల వరకు వచ్చేది కేవలం వాకర్లు మాత్రమే. ఆ సమయంలో పర్యాటకులు రారు. కాబట్టి ఉదయం ఏడు గంటల తర్వాత వచ్చే విజిటర్స్ కు మాత్రమే ఫీజులు అమలు చేయాలి తప్ప, ఆరోగ్యం కోసం వచ్చే వాకర్లను ఇబ్బంది పెట్టకూడదు' అని వారు ఎమ్మెల్యేకు వివరించారు.

### అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు

వాకర్ల వాదనలతో ఏకీభవించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. నేరుగా భద్రకాళి బండ్‌కు సంబంధించిన 'కుడా' అధికారికి ఫోన్ చేసి మాట్లాడారు. వాకర్ల నుంచి ఎలాంటి అమౌంట్ అడగకూడదని, వెంటనే ఆ వసూళ్లను రద్దు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అధికార యంత్రాంగం ఆగడాలకు చెక్ పెట్టి, తమ దినచర్యకు ఆటంకం లేకుండా చేసిన ఎమ్మెల్యే నాయినికి వాకర్ల బృందం ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో భద్రకాళి వాకర్స్ మార్త రాజేందర్, బుర్రి తిరుపతి, సురేష్ రావు, దశరథం, పులుమాటి రవికుమార్, న్యాయవాది జీవీ.రావు, మంద వేణు, శ్రీధర్ చిన్నాల, సామల సురేష్, సునీల్ రెడ్డి, పర్షబోయిన విజయ్ కుమార్, సదానందం, నెమురుగొమ్ముల అమర్‌నాథ్, మార్త రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# మా కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం..

☐ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ కాంగ్రెస్ కార్యకర్తపై జరిగిన దాడి ఘటనపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మా కార్యకర్తల జోలికొస్తే ఊరుకోబోమంటూ హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలతో వరంగల్ పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అధికారం కోల్పోయినా కొంతమంది ప్రతిపక్ష నేతలు ఇంకా గుండాల మాదిరిగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఉద్యమ కాలంలో అధికారులపై దాడులకు పాల్పడిన నాయకత్వం ఇప్పటికీ అదే స్వభావంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్ మా కాంగ్రెస్ కార్యకర్తపై దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. గతంలో తోట పవన్‌పై జరిగిన దాడిని కూడా గుర్తుచేస్తూ, ఇది ఒంటరి ఘటన కాదని, క్రమపద్ధతిలో జరుగుతున్న దాడుల శ్రేణిలో భాగమని అన్నారు. నిన్నటి ముఖ్యమంత్రి పర్యటనపై అవాకులు చెవాకులు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. మా ప్రభుత్వం ప్రజల పక్షాన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని స్పష్టం చేశారు. వినయ్ భాస్కర్‌పై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, రాజకీయ లాభాల కోసం జిల్లాను ముక్కలు చేశారని ఆరోపించారు. గతంలో భద్రకాలి ఆలయ పరిసరాల్లో గుడిసెల తొలగింపుపై తీర్మానం చేసింది అదే నాయకత్వమని, ఇప్పుడు అమ్మవారి పేరుతో రాజకీయాలు చేయడం ద్వంద్వ వైఖరని పేర్కొన్నారు. భద్రకాలి అంశాన్ని ప్రస్తావిస్తూ, ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టడం ఆపాలని సూచించారు. అధికారంలో ఉన్నప్పటికీ మా సహనం బలహీనత కాదని, అభివృద్ధి మా సిద్ధాంతమని, కక్షపూరిత రాజకీయాలు మా స్వభావం కాదని స్పష్టం చేశారు. కార్యకర్తల రక్షణ విషయంలో రాజీ పడేది లేదని తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదర్శంగా ముందుకు..

- త్వరలోనే మళ్లీ ఫ్యామిలీ టూర్
- ఉదయం మిత్రమండలి భవిష్యత్ కార్యాచరణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కలిసికట్టుగా ముందుకు సాగుతూ రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధికర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసే దిశలో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఉదయం మిత్రమండలి వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దాసరి కృష్ణారెడ్డి అభిప్రాయ పడ్డారు. ఉదయం మిత్రమండలి ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం బాలసముద్రంలోని ఎ.రామ్మూర్తి నివాసగృహంలో కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కాళేశ్వరం, ఉజ్జయినీ టూర్ ల విజయవంతానికి సహకరించిన వారికి శుభాకాంక్షలు తెలుపడమే కాక.. తొలిసారి కుటుంబ సభ్యులతో నిర్వహించిన కార్యక్రమాలకు సహాయ, సహకారాలు అందించిన సభ్యులు బి.రామారావు–రాణీభాయి, ఎంఎల్ఎన్ మూర్తి దంపతులతో పాటు స్వల్ప వ్యవధిలో భూపాలపల్లిలో ఆతిథ్యం ఇచ్చిన అక్కడి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు సమావేశం అభినందనలు తెలిపింది. అంతే కాకుండా ఇటీవల అనారోగ్యం బారిన పడిన సభ్యుడు మెండు ఉమామహేశ్వర్ ఆయురారోగ్యాలతో త్వరితగతిన కోలుకోవాలని సమావేశం అభిప్రాయపడింది. ఆయనకు ఆర్థికంగా చేయూత నివ్వాలని సమావేశం ఆకాంక్షించింది. రాబోయే రోజుల్లో ఉదయం మిత్రమండలి సభ్యులందరికీ బీమా సౌకర్యం కల్పించాలని సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు సాధ్యాసాధ్యాలను క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి ఇటు బ్యాంకు.. అటు బీమా సంస్థల్లో ఎవరు ఉపయోగపడేలా తమకు నిబంధనలను వర్తింపచేస్తారో... ఆ సంస్థ ద్వారా ఉదయం సభ్యులందరికీ గ్రూప్ ఇన్సూరెన్స్ వర్తింపచేయాలని సమావేశం సంకల్పించింది. ఇప్పటికే సభ్యులు ప్రతినెలా రూ.500 చొప్పున పొదుపు చేసుకుంటున్న సొమ్మును బ్యాంకులో డిపాజిట్ చేయడం ద్వారా అదనపు ఆదాయాన్ని సాధించాలని నిర్ణయించి మరిన్ని సంక్షేమ చర్యలపై మండలి దృష్టిని పెట్టాలని సమావేశంలో నిర్ణయించారు.

### మార్చి15న ఫ్యామిలీ మీట్...

కాళేశ్వరం తరహాలోనే పాలకుర్తి సోమేశ్వరుడితో పాటు శ్రీరామచంద్రుని దర్శనం కోసం సభ్యులంతా కుటుంబ సభ్యులతో కలిసి ఆహ్లాదకర వాతావరణంలో మరోసారి వచ్చే నెల మార్చి 15వ తేదీన పాలకుర్తిలో ఫ్యామిలీ మీట్ నిర్వహించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆట పాటలతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఉండేలా కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు.

### ప్రతిపాదిత స్థల పరిశీలన..

సభ్యులకు అందుబాటులో ఉండే ధరలో కనుక భూమి లభ్యమైతే దానిని పరిశీలించాలని.. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండి అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో లభ్యమయ్యే స్థల ప్రతిపాదనలు పరిశీలించి అందించే అంశంలో సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని.. ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని చెబుతున్న వాటిని పరిశీలించి అర్హతలన్నీ ఆ స్థలానికి ఉంటేనే ముందుకు సాగాలని సమావేశంలో చర్చించారు. ఇప్పటికే ఇతరులకు మార్గదర్శిగా మారి ఆదర్శవంతంగా పని చేస్తున్న ఉదయం మిత్రమండలి వరంగల్ సంస్థను మరింత బలోపేతం చేయాలని ఆదిశలో మరిన్ని అభిప్రాయాలు సేకరించి చర్చించేందుకు త్వరలోనే ఉమ్మడి వరంగల్ జిల్లా మండలి సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించాలని.. అప్పటి వరకు తొలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలమేరకు వచ్చే సెప్టెంబర్ మాసం వరకు అవే ప్రతిపాదనలు అమలులో ఉండాలని నిర్ణయించారు. రెండేళ్ల గడువు తీరినాకే..కొత్త ప్రతిపాదనలేవైనా చర్చించి అమలులోకి వచ్చేలా చూడాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది.




### ఘనంగా మ్యారేజ్ డే..

మండలి ప్రధాన కార్యదర్శి కన్న పరశురాములు 53 వ వివాహ వేడుకలు ఈ సమావేశంలో ఘనంగా జరిగాయి. ప్రత్యేకంగా సభ్యులు తెప్పించిన కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అధ్యక్షులు దాసరి కృష్ణారెడ్డి నేతృత్వంలో శాలువా కప్పి కన్నకు సభ్యులంతా కేక్ తినిపించి సత్కరించారు. ఈ సమావేశానికి మండలి ప్రధాన కార్యదర్శి కన్న పరశురాములు, కోశాధికారి అచ్యుత రఘునాథ్, సంయుక్త కార్యదర్శి ముల్లంగి మోహన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పెచ్చెటి వెంకటేశ్వర రావు, అనిశెట్టి రామ్మూర్తి, ఏవీ శర్మ, ఎంఎల్ఎన్ మూర్తి, తక్కెళ్లపల్లి రవీందర్ రావు తదితరులు హాజరయ్యారు.

# ముగిసిన సీఎం కప్ క్రీడల కోలాహలం

## ● విజేతలకు బహుమతుల ప్రదానం

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** స్థానిక జేఎన్ఎస్ స్టేడియంలో గత నాలుగు రోజులుగా అత్యంత ఉత్సాహంగా సాగిన జిల్లాస్థాయి సీఎం కప్-2026 క్రీడా పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, వివిధ క్రీడల్లో ప్రతిభ చాటిన విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి, వారిని జాతీయ స్థాయికి చేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సీఎం కప్





నిర్వహిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. క్రీడలు కేవలం వినోదం కోసమే కాకుండా.. విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, టీమ్ వర్క్ (జట్టు భావన) పెంపొందించడానికి తోడ్పడతాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారుల ప్రతిభను అభినందిస్తూ, భవిష్యత్తులో వీరంతా ఒలింపిక్స్, జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, జిల్లా యువజన క్రీడల అధికారి అశోక్, నాయకులు లక్ష్మణ్, సారంగపాణిలతో పాటు పలువురు అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# చిట్యాలలో గోటితో తలంబ్రాల తయారీ



**వరంగల్ వాయిస్, చిట్యాల :** భద్రాచలంలో వేడుకగా జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామివారి కళ్యాణ మహోత్సవం కోసం శ్రీరామదాసు భక్తమండలి (చెల్పూర్) ఆధ్వర్యంలో చిట్యాల మండల కేంద్రంలో గోటి తలంబ్రాల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ బుర్ర సదయ్య మాట్లాడుతూ.. స్వామివారి కళ్యాణం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ చేతులతో (గోటితో) వడ్లను వొలిచి తలంబ్రాలను సిద్ధం చేయాలని కోరారు. శ్రీ హనుమాన్ భజన మండలి అధ్యక్షులు నేపాలి వేణు సింగ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా శోభయాత్రను నిర్వహించారు. భక్తుల రామనామ స్మరణతో చిట్యాల వీధులన్నీ మారుమోగాయి. వెంకట్రావుపల్లి (సి) హనుమాన్ దేవాలయంలో గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మీ అంతయ్య దంపతులు పూజలు నిర్వహించి, వడ్లు వొలిచే కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిట్యాల ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శృంగారపు రంగాచారి-ఉమామహేశ్వరి దంపతులు ఈ సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో తౌటం నవీన్, బైరం భద్రయ్య, ప్రవీణ్, రమేష్, శ్రీనివాస్, ప్రభాకర్, సరోజనతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

# నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ గా ఇటీవల ఎన్నికైన పద్మశాలి ముద్దుబిడ్డ పెండం శ్రీ లక్ష్మీ రామానందంను వరంగల్ నగరంలోని 20వ డివిజన్‌కు చెందిన పద్మశాలి సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. స్థానిక పద్మశాలి ప్రతినిధులు ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పద్మశాలి సంఘం, వివిధ సామాజిక విభాగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి మున్సిపల్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం గర్వకారణమని, రాబోయే రోజుల్లో నర్సంపేట పట్టణ అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించాలని నాయకులు ఆకాంక్షించారు. హైకోర్టు అడ్వకేట్ సాంబారు ప్రభాకర్, సామాజికవేత్త పెరుమాళ్ల లక్ష్మణ్, కాశిబుగ్గ జేఏసీ మాజీ చైర్మన్ డాక్టర్ కొనతం కృష్ణ, కాశిబుగ్గ పద్మా నగర్ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు గంజి సాంబయ్య, పద్మశాలి పరపతి సంఘం అధ్యక్షుడు డాక్టర్ మామిడి ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి దూడం అనిల్ కుమార్, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, బీజేపీ నాయకులు కోట సతీష్, రంగనాథ స్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు వంగరి రవి, పిట్టల ఉపేందర్, వరంగల్ ప్రింటర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మాటేటి అశోక్ కుమార్, ప్రముఖ కళాకారుడు మార్త సోమయ్య, రాజేందర్, బాల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

## ములుగు కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 51 దరఖాస్తులు రాగా వాటిలో భూ సమస్యలు 15, ఇందిరమ్మ ఇళ్లు 07, ఉపాధి కల్పనకు 06, పెన్షన్ 07, ఇతర శాఖలకు సంబంధించినవి 16 ఫిర్యాదులు అందాయి. ప్రజావాణిలో వచ్చే ఏ ఒక్క అర్జీని కూడా పెండింగ్‌లో ఉంచకుండా, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల గురించి అర్జీదారులకు ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేయాలని సూచించారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ గోడును కలెక్టర్‌కు స్వయంగా వివరించి అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సురక్షిత ప్రయాణం - అందరి బాధ్యత



**వరంగల్ వాయిస్, దామెర:** తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లావ్యాప్తంగా వారం రోజుల పాటు నిర్వహిస్తున్న "అరైవ్ అలివ్ -2026" కార్యక్రమంలో భాగంగా దామెర పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దామెర మండల పరిధిలోని జాతీయ రహదారి-163 పక్కన గల ఓగ్లాపూర్ గ్రామ సెంటర్ వద్ద ఈ కార్యక్రమం జరిగింది. రోడ్డు ప్రమాదాలను అరికట్టడం, వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనదారులు పాటించాల్సిన ఫాలోయింగ్ లైన్, సురక్షితంగా ఓవర్‌టేక్ చేయడంపై పోలీసులు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాయంపేట సీఐ రంజిత్ రావు మాట్లాడుతూ "ప్రతి వాహనదారుడు రహదారి నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి. ముఖ్యంగా అతివేగం, అజాగ్రత్తగా ఓవర్‌టేక్ చేయడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజలందరూ అరైవ్ అలివ్ -2026 కార్యక్రమంలో భాగస్వాములై రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎల్లప్పుడూ నిర్ణీత వరుసలోనే ప్రయాణించాలి, మలుపుల వద్ద, ఇరుకైన రోడ్లపై ఓవర్‌టేక్ చేయకూడదు, ప్రయాణంలో క్షేమంగా గమ్యాన్ని చేరుకోవడమే ప్రాధాన్యతగా పెట్టుకోవాలని సూచించారు.

# పంతులుపల్లి పాఠశాల తనిఖీ



**వరంగల్ వాయిస్, నల్లబెల్లి :** మండలంలోని నాగరాజు పల్లి పరిధిలోని పంతులుపల్లి ప్రాథమిక పాఠశాలను నల్లబెల్లి కాంప్లెక్స్ హెచ్ఎం అంబి వసంత సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను, ఉపాధ్యాయుల విద్య బోధనను పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను, ఎఫ్ ఎల్ ఎన్ బోధనను, పాఠ్యపుస్తక బోధన, వర్క్ బుక్ నిర్వహణ, పీటీఎమ్ నిర్వహణ రిజిస్టర్, ఎండీఎం నిర్వహణ, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెడుతున్నారా లేదా.. అనే విషయాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు తగిన సలహాలు ఇచ్చారు. ఎఫ్ఎల్ఎన్ శాంపిల్ సర్వే జరుగనున్న నేపథ్యంలో విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. అలాగే ఎఫ్ఎల్ఎస్ లో మంచి ఫలితాలు సాధించేలా మూడో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. పాఠశాల రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కర్ణకంటి రామ్మూర్తి పాల్గొన్నారు.

# పిల్లలకు తల్లిదండ్రులు బరువు కాదు.. బాధ్యత కావాలి

## ▪ డాక్టర్ అనితా రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** "వృద్ధాప్యం ఎవరికీ శాపం కాకూడదు.. కడవరకు వారికి ప్రేమ, ఆప్యాయత, గౌరవం దక్కాలి" అని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా పరిషత్ ఆవరణలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ను ఆమె సందర్శించి, అక్కడ ఉన్న వృద్ధులతో ముచ్చటించారు. సంతానం తమ తల్లిదండ్రులను భారంగా భావించకుండా, బాధ్యతగా చూసుకోవాలని ఆమె హితవు పలికారు. సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ మెంబర్‌గా వృద్ధులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని, ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అవసరమైతే ట్రిబ్యునల్ కోర్టు ద్వారా తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. వృద్ధులు ఒంటరితనంతో బాధపడకుండా డే కేర్ సెంటర్లలోని గ్రంథాలయాలను, ఇతర వసతులను ఉపయోగించుకోవాలని సూచించారు. వృద్ధుల మానసిక ఉల్లాసం,



ఆరోగ్యం కోసం సెంటర్‌లో కల్పించిన వసతులను ఆమె వివరించారు. ఉచిత లీగల్ సెంటర్ మరియు ఉచిత ఫిజియోథెరపీ సౌకర్యం. టీవీ, ఎయిర్ కూలర్, సౌకర్యవంతమైన కుర్చీలు, లైబ్రరీ పుస్తకాలు, వివిధ రకాల ఆట వస్తువులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డితో పాటు ఫిజియోథెరపీ డాక్టర్ ఉష, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వరంగల్ సెక్రటరీ దేవాచారి, వైస్ చైర్మన్, పలువురు వయోవృద్ధులు పాల్గొన్నారు.

# విశ్వదీప్తి స్కూల్‌లో పేరెంట్ టీచర్ మీటింగ్



**వరంగల్ వాయిస్, మల్హర్:** మండలంలోని కొయ్యూరు లో గల విశ్వ దీప్తి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆదివారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ను నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల విద్యా ప్రగతి, ప్రవర్తన సమగ్ర వికాసంపై తల్లిదండ్రులతో చర్చించారు. అనంతరం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్లే మెటీరియల్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు సర్పంచ్ కొండ రాజమ్మ, ఉప సర్పంచ్ లకావత్ సవేందర్, పీటీఏ ప్రెసిడెంట్ సంతోష్, ప్రిన్సిపల్ ఎం.కే సుదర్శన్, వైస్ ప్రిన్సిపల్ మెర్సీ వర్గీస్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ముస్త్యాలపల్లిలో ఉచిత వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, నడికూడ :** వరంగల్ జిల్లా నడికూడ మండలం ముస్త్యాలపల్లి గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. గ్రామ సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ చొరవతో, హనుమకొండలోని అజర హాస్పిటల్ సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నిపుణులైన వైద్య బృందం గ్రామ ప్రజలకు జనరల్ మెడిసిన్, కార్డియాలజీ (గుండె సంబంధిత), బీపీ (రక్తపోటు), షుగర్ (మధుమేహం) వంటి వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ప్రత్యేకంగా వైద్య బృందాన్ని పంపిన అజర హాస్పిటల్ యాజమాన్యానికి, డాక్టర్లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్‌తో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి దొంతుల కరుణాదేవి, వార్డు సభ్యులు, కారోబార్, గ్రామ పంచాయతీ సిబ్బంది, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# పసికందు ప్రాణం తీసిన కుల దురహంకారం

**నిందితులను కఠినంగా శిక్షించాలి**

**తాటిపాముల వెంకట్రాములు డిమాండ్**



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా చోటుచేసుకున్న దారుణ ఘటనపై బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం కుల వివక్షతో ఒక రజక కుటుంబానికి చెందిన రెండు నెలల పసికందును నేలకు కొట్టి చంపడం నాగరిక సమాజం తలదించుకోవాల్సిన విషయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయంలోకి రజక కుటుంబాన్ని రాకుండా అడ్డుకోవడమే కాకుండా, పసిపాపను వదిలివేయమని వేడుకున్నా వినకుండా తల్లి చంద్రకళ చేతుల్లో నుంచి బాబును లాక్కొని నేలకేసి కొట్టి చంపడం అత్యంత క్రూరమని ఖండించారు. ఇంతటి దారుణానికి ఒడిగట్టిన వారిపై తక్షణమే హత్యా నేరం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయడంలో పోలీసులు జాప్యం చేయడంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, హోం మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, ఈ నరరూప రాక్షసులను కఠినంగా శిక్షించేలా పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించాలని డిమాండ్ చేశారు. పసిపాప మృతికి కారణమైన దుండగులను తక్షణమే అరెస్టు చేసి చట్టరీత్యా కఠినంగా శిక్షించాలి. బాధిత రజక కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, అన్ని విధాలా ఆదుకోవాలి. భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడా కుల వివక్ష దాడులు జరగకుండా ప్రభుత్వం కఠినమైన నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# మూడు నెలల్లో కుందారం గ్రామ సమస్యల పరిష్కారం

**▪ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ**



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** లింగాల ఘనపూర్ మండలం కుందారం గ్రామం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట వంటిదని, గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత తనదని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. సోమవారం కుందారం గ్రామస్తులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుందారం చెరువులో ఏడాది పొడవునా నీరు ఉండేలా కాలువకు తూము, చెరువుకు షట్టర్ ఏర్పాటు చేస్తామని, తద్వారా రెండు పంటలకు సాగునీరు అందిస్తామని భరోసా ఇచ్చారు. వారం రోజుల్లో 40 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని, మరో రెండు నెలల్లో అదనంగా 60 ఇండ్లను కేటాయిస్తామని వెల్లడించారు. స్మశాన వాటికకు రోడ్డు నిర్మాణంతో పాటు విద్యుత్ లైన్, వీధి దీపాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పనులన్నీ 3 నెలల్లో పూర్తి చేస్తామని గడువు విధించారు. అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాళ్లకు ఒక్కో దానికి రూ.5 లక్షల చొప్పున, రెండు హాళ్లకు కలిపి రూ.20 లక్షలు మంజూరు చేస్తామని, కొత్త హాళ్ల నిర్మాణానికి కూడా నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు. స్థలం అందుబాటులో ఉంటే వెంటనే అంగన్‌వాడీ భవనాన్ని మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఇంటి నిర్మాణ వ్యయం, నాణ్యతను అడిగి తెలుసుకున్న ఆయన, త్వరితగతిన ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారుడి కుటుంబ సభ్యులను అభినందించారు. నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయంలో బీరప్ప – కామరతి కళ్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కురుమ కులస్తులు ఆయనకు ఘనస్వాగతం పలకగా, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూకట్ల రాజు, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ప్రవీణ్, మండల పార్టీ అధ్యక్షుడు శివ కుమార్, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు విలువలకు ప్రతీక యాసా జీవితం

**న్యూడెమోక్రసీ నాయకుల ఘన నివాళి**



**వరంగల్ వాయిస్, డోర్నకల్/ చిల్కోడు :** సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు, సీనియర్ విప్లవ నాయకులు కామ్రేడ్ యాసా వెంకట్ నారాయణ అనారోగ్యంతో కన్నుమూయడంతో, చిల్కోడు గ్రామంలో ఆయన సంతాప సభను ఘనంగా నిర్వహించారు. బాలెం వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ నివాళులర్పించారు. నాలుగు దశాబ్దాల పోరాటం: గత 45 ఏళ్లుగా డోర్నకల్ కేంద్రంగా విప్లవోద్యమ నిర్మాణంలో యాసా వెంకట్ నారాయణ కీలక పాత్ర పోషించారని నాయకులు కొనియాడారు. నిర్బంధాలు, ఆటుపోట్లు ఎదురైనా చివరి శ్వాస వరకు ఎర్రజెండా అజెండాకే కట్టుబడి జీవించారని గుర్తుచేసుకున్నారు. భూస్వామ్య పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడి, తహసిల్దార్ బంజర గ్రామాన్ని పార్టీకి కంచుకోటలా మార్చడంలో ఆయన కృషి అనన్యసామాన్యమని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలకు, సామాన్య ప్రజలకు ఆయన ఎప్పుడూ ఒక పెద్దదిక్కుగా ఉండేవారని తెలిపారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు, ఈ ప్రాంత పేద ప్రజలకు తీరని లోటని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో పెరుగుతున్న నియంతృత్వ, ఫాసిస్టు ధోరణులను ఎదిరించడానికి ఐక్య ఉద్యమాలు నిర్మించడమే కామ్రేడ్ యాసాకు ఇచ్చే అసలైన నివాళి అని నాయకులు పిలుపునిచ్చారు. నికార్సైన కమ్యూనిస్టుగా జీవించిన ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. ఈ నివాళి సభలో బాలెం వెంకటేష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విధులు ముగిసినా దక్కని వేతనం

**ఎఫ్ఎస్‌టీ వీడియో గ్రాఫర్ల గోడు**



**వరంగల్ వాయిస్, పరకాల:** గత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ లో విధులు నిర్వహించిన వీడియో గ్రాఫర్ల పరిస్థితి ప్రస్తుతం "అడకత్తెరలో పోకచెక్క"లా మారింది. నిద్రాహారాలు మానేసి, రెండు షిఫ్టుల్లో కష్టపడి పనిచేసిన తమకు రావాల్సిన వేతనాలు అందక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో మొదటి, రెండో షిఫ్టుల్లో ఎంతో బాధ్యతగా పనిచేసిన వీడియో గ్రాఫర్లకు, పని ముగిసి రోజులు గడుస్తున్నా నేటికీ వేతనాలు చెల్లించలేదు. తమ కష్టార్జితం కోసం పరకాల నియోజకవర్గంలోని ఆయా మండలాల ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు తెచ్చి కెమెరాలు కొనుగోలు చేసిన వీడియో గ్రాఫర్లు, సకాలంలో డబ్బులు రాకపోవడంతో ఈఎంఐలు కట్టలేక, కుటుంబ పోషణ భారమై సతమతమవుతున్నారు. ఈ సమస్యపై ఉమ్మడి వరంగల్ జిల్లా ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆర్గనైజర్ కొడెపాక భాస్కర్ ఘాటుగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ "ఎన్నికల విధుల్లో వీడియో గ్రాఫర్లు కీలక పాత్ర పోషించారు. కానీ వారిని గుర్తించడంలో, వేతనాలు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, వెంటనే నిధులు విడుదల చేసి వీడియో గ్రాఫర్లను ఆదుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను తక్షణమే క్లియర్ చేయాలని, ఎంపీడీవో కార్యాలయాల్లో బిల్లుల విషయంలో జరుగుతున్న జాప్యంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

# బాల్య వివాహ రహిత జిల్లాయే లక్ష్యం

**◆ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**వరంగల్ వాయిస్, జనగామ:** జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో మహిళా శిశు సంక్షేమ శాఖ, స్కోప్ (సొసైటీ ఫర్ ప్రోగ్రెసివ్ యాక్షన్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎడ్యుకేషన్) స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన "బాల్య వివాహ ముక్త భారత్" ప్రచార రథాన్ని గౌరవ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రచార రథం జిల్లావ్యాప్తంగా బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉన్న సుమారు 50 గ్రామాలు, హాట్‌స్పాట్ ప్రాంతాలు, ఆసుపత్రులు, ప్రధాన కాలనీల్లో పర్యటిస్తుంది. బాలల హక్కులు, బాల్య వివాహ నిరోధక చట్టం, బాలల రక్షణ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ఏదైనా ఆపద కలిగితే సంప్రదించాల్సిన చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ (1098)పై విస్తృత ప్రచారం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు సిగ్నేచర్ క్యాంపెయిన్‌లో పాల్గొని సంతకం చేశారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు కట్టుబడి పనిచేస్తామని అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు బాలికల ఆరోగ్యం, విద్య, వారి ఉజ్వల భవిష్యత్తును దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, సమాజం కలిసి పని చేస్తేనే ఈ దురాచారాన్ని పారద్రోలడం సాధ్యమవుతుందని జిల్లా సంక్షేమ అధికారి కోదండరాములు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కోదండరాములు, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారి కుమారస్వామి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవికాంత్, స్కోప్ ఎన్జీఓ ప్రతినిధి మనోజ్ కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ రవికుమార్, సఖి సెంటర్ నిర్వాహకురాలు రేణుక, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ సుధ,పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# వారసత్వ నగరం ఓరుగల్లుపై మమకారం

- లయన్స్ సదస్సులో డాక్టర్ నైనా జైస్వాల్
- సేవ చేసే అవకాశమే అదృష్టంగా భావించాలి
- ఘనంగా లయన్స్ ప్రాంతీయ సమ్మేళనం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** "చారిత్రక నగరం ఓరుగల్లు అన్నా, ఇక్కడ కొలువైన భద్రకాళి అమ్మవారు అన్నా నాకు ఎంతో ఇష్టం. రంగసాయిపేట మట్టి పరిమళాలే నా ఎదుగుదలకు కారణం" అని యువ ఆల్ రౌండర్, డాక్టర్ నైనా జైస్వాల్ అన్నారు. ఆదివారం రాత్రి లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన 'ఏకశిలా లయన్స్ ప్రాంతీయ సదస్సు'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. యువత మొబైల్ ఫోన్లకు బానిసలై సమయాన్ని వృథా చేయకుండా, నిర్దిష్ట లక్ష్యాలను ఎంచుకుని ప్రణాళికాబద్ధంగా కష్టపడాలని సూచించారు. ఆడపిల్లలను గౌరవించే సమాజమే నిజమైన అభివృద్ధిని సాధిస్తుందని పేర్కొన్నారు. 8ఏళ్లకే పదో తరగతి, 13 ఏళ్లకే డిగ్రీ పూర్తి చేసి, అతి చిన్న వయసులో పీహెచ్‌డీ సాధించిన తన ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణిగా, వయోలిన్ విద్వాంసురాలిగా తనను ఆదరిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. "ఒక మంచి మిత్రుడు వంద గ్రంథాలయాలతో సమానం. నవ్వు వెనుక బాధను, మౌనం వెనుక మాటను అర్థం చేసుకునేవాడే నిజమైన స్నేహితుడు" అని పేర్కొన్నారు. హైదరాబాద్ ఫ్యామిలీ కోర్టు ప్రిన్సిపల్ జడ్జ్ డాక్టర్ కంచి ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో నైతిక విలువలు దిగజారుతున్నాయని, భార్యాభర్తల పవిత్ర అనుబంధానికి విలువ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సామాజిక సమస్యల పరిష్కారంలో లయన్స్ సంస్థ చైతన్యవంతమైన పాత్ర పోషించాలని కోరారు. కావేటి మురళీధర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ తాళ్ల రవి స్వాగతం పలికారు. రీజియన్ పరిధిలోని హసన్‌పర్తి, పరకాల, నర్సంపేట, హనుమకొండ గోల్డ్, కాకతీయ తదితర క్లబ్బులు తాము చేసిన సేవా కార్యక్రమాలను బ్యానర్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, నరహరి సుధాకర్ రెడ్డి, పి. హరికిషన్ రెడ్డి, పొట్లపల్లి శ్రీనివాసరావు, ముచ్చ రాజిరెడ్డి, డాక్టర్ బి.లక్ష్మీనారాయణ, తిరునగరి నరేందర్, పెండెం వేణు మాధవ్, గుండేటి రమణయ్య, కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితర లయన్స్ ప్రముఖులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి

◆ మర్కజీలో వందేమాతరం క్యాలెండర్ల పంపిణీ




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వందేమాతరం గేయం 150వ జయంతిని పురస్కరించుకొని భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) ఓరుగల్లు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు దేశభక్తిని చాటేలా వినూత్న కార్యక్రమం చేపట్టారు. సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన క్యాలెండర్లను పంపిణీ చేశారు. వందేమాతరం పూర్తి పాఠంతో పాటు, భారత స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలతో కూడిన ఈ క్యాలెండర్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా బీవీపీ కార్యదర్శి కె.సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. భావి భారత పౌరులైన విద్యార్థుల్లో దేశభక్తిని, జాతీయతా భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా బీవీపీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవి రామారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. విద్యార్థుల వికాసానికి బీవీపీ అందిస్తున్న సహకారం గొప్పదని, ముఖ్యంగా పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం హర్షణీయమని కొనియాడారు. బీవీపీ అధ్యక్షుడు డాక్టర్ డి.సుధీర్ కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించారు. హనుమకొండలోని మర్కజీ పాఠశాలతో పాటు భీమదేవరపల్లి మండలం ముల్కనూరు జిల్లా పరిషత్ (బాలుర & బాలికల) పాఠశాలలు, దామెర మండలం కొగిల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు కూడా ఈ క్యాలెండర్లను పంపారు. ఈ కార్యక్రమంలో బీవీపీ బాధ్యులు చంచల్ అగర్వాల్, సీహెచ్ జయపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వీసీ రామారావు, వివేకానంద రెడ్డి, రామానుజంతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు వల్స పైడి, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ టీజీ ఎడ్‌సెట్ షెడ్యూల్ విడుదల

- కేయూ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహణ
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 2026 విద్యా సంవత్సరానికి బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించబడనున్న టీజీ ఎడ్ సెట్ –2026 పూర్తి షెడ్యూల్‌ను కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విడుదల చేశారు. టీజీ ఎడ్ సెట్ –2026 చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి సోమవారం విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో నిర్వహించిన పత్రికా విలేఖరుల సమావేశంలో షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 20న నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఓసీ/బీసీ అభ్యర్థులు రూ.750 పరీక్షా ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులు రూ.550 చెల్లించి దరఖాస్తు నమోదు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుల సమర్పణకు ఏప్రిల్ 15 చివరి గడువుగా నిర్ణయించారు. రూ.250 అపరాధ రుసుముతో ఏప్రిల్ 22 వరకు, మరోసారి రూ.250 అపరాధ రుసుముతో ఏప్రిల్ 27 వరకు, రూ.1000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 30 వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయి. మే 2 నుంచి దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉంటుంది. మే 4న పరీక్షా కేంద్రాల కేటాయింపు జరుగుతుంది. రూ.5000 అపరాధ రుసుముతో మే 8, 9 తేదీలలో ప్రత్యేక అవకాశాన్ని కల్పించనున్నారు. హాల్ టికెట్లు మే 9 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష మే 12న ఉదయం 10.00 గంటలకు, మధ్యాహ్నం 2.00 గంటలకు రెండు సెషన్‌లలో నిర్వహించబడుతుంది. మే 15న ప్రాథమిక కీ విడుదల చేయబడుతుంది. మే 17 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. తుది ఫలితాలు మే 30న ప్రకటించబడతాయి. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఆచార్య బి.వెంకట్రామరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, ఎడ్యుకేషన్ డీన్ ఆచార్య ఎన్.రామనాథ కిషన్, ఎడ్యుకేషన్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీ ఎడ్ సెట్–2026 అధికారిక వెబ్‌సైట్‌ను కూడా ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా టీజీ ఎడ్ సెట్ –2026 నిర్వహణకు 16 నగరాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు, హైదరాబాద్ ను నాలుగు భాగాలగా, నల్గొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్ నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, సిద్దిపేట్ ఉన్నట్లు కన్వీనర్ ఆచార్య బి.వెంకట్రామరెడ్డి తెలిపారు.

# నో హెల్మెట్.. నో పెట్రోల్



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని మల్లారం గ్రామంలో సోమవారం కొయ్యూరు పోలీసులు హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొయ్యూరు ఎస్సై 2 రాజన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డు భద్రతలో భాగంగా ప్రజలు అందరు బైక్ పై ప్రయాణ సమయం లో తప్పని సరిగా హెల్మెట్ ధరించాలి అని ఇకపై హెల్మెట్ లేకుంటే పెట్రోల్ బంక్ లో పెట్రోల్ లభించదని బంక్ యజమానులకు ఆదేశాలు జారీ చేశామని, ప్రజలందరూ తప్పనిసరిగా భద్రత ప్రమాణాల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. కొయ్యూరు పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# అక్కంపేటలో గుడుంబా పట్టివేత

## నిందితుడిపై కేసు నమోదు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మండలంలోని అక్కంపేట గ్రామంలో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఆత్మకూరు సీఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో పోలీసులు నిఘా ఉంచగా, విశ్వసనీయ సమాచారం మేరకు అక్కంపేటలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. నిందితుడు కోరిక మురళి , నల్లబెల్లి మండలం నందిగామ గ్రామం కాగా, అక్కంపేట గ్రామంలో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని, అక్కడి నుంచి వివిధ గ్రామాలకు గుడుంబా రవాణా చేస్తూ విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితుడిని అరెస్టు చేసి, అతనిపై ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. అక్రమ మద్యం, గుడుంబా విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# ఉద్యమకారుల పిటిషన్‌పై హైకోర్టు తీర్పు చారిత్రాత్మకం

- న్యాయవాది కలకోటి మహేందర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారుల విషయంలో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం (హైకోర్టు) ఇచ్చిన తీర్పు పట్ల ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ తీర్పు తెలంగాణ ఉద్యమకారుల్లో కొత్త ఆశలను నింపిందని, ఇది అణగారిన ఉద్యమకారుల గెలుపు అని ఉద్యమకారుడు, న్యాయవాది కలకోటి మహేందర్ పేర్కొన్నారు. "తెలంగాణ రాష్ట్రానికి ఉద్యమకారులే సైనికులు. ప్రభుత్వాలు వారిని గుర్తించకపోయినా, న్యాయస్థానం వారి సేవలను గుర్తించి సానుకూల తీర్పు ఇవ్వడం ప్రభుత్వాలకు కనువిప్పు కావాలి" అని మహేందర్ అన్నారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏ ఆశయంతో అయితే తెలంగాణ తెచ్చుకున్నామో, ఆ ఆశయ సాధనలో భాగస్వాములైన వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఒక బోర్డును ఏర్పాటు చేయాలి. ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇళ్ల స్థలాన్ని కేటాయించాలి. నెలకు రూ.25,000 పెన్షన్ తో పాటు ఇతర సంక్షేమ పథకాలను ఉద్యమకారులందరికీ వర్తింపజేయాలి. ఈ కార్యక్రమంలో కళా నాయకులు గోల్కొండ బుచ్చన్న, పారునంది ఈశ్వర ప్రసాద్, గోవిందు ఆనంద్, అంకిళ్ల సదానందం, మంద మహేందర్ తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే మా లక్ష్యం

**➡ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచి, కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ మర్కజ్ ఉన్నత పాఠశాలలో బాలవికాస్ సేవాసంస్థ–అమెజాన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుమారు రూ.8లక్షల విలువైన 20 ల్యాప్‌టాప్‌లను విద్యార్థులకు అందజేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో అసంపూర్తిగా ఉన్న పాకశాల భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, పనులు పూర్తి చేయడానికి తన నిధుల నుంచి రూ.5లక్షలు తక్షణమే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సోమిడి, దర్గా, వడ్డేపల్లి, శాయంపేట వంటి గ్రామీణ పరిసరాల పాఠశాలల్లో కూడా మౌలిక వసతులు పెంచేందుకు సేవా సంస్థలు ముందుకు రావాలని కోరారు. “డిజిటల్ యుగంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వెనుకబడకూడదు. అందుకే స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, కంప్యూటర్ విద్యపై దృష్టి సారించాం. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నియోజకవర్గంలోని పాఠశాలలకు ప్రత్యేక నిధులు కేటాయించి మరమ్మతులు, తాగునీరు, ప్రహరీ గోడల వంటి పనులు చేపట్టామని అన్నారు. పూర్వ విద్యార్థులు తమ పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమైతేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, యువజన కాంగ్రెస్ నాయకులు విష్ణురెడ్డి, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, బాలవికాస్ ప్రతినిధి షౌర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు శివాజీ, డీఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణానికి శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, దామెర:** గ్రామాభివృద్ధిలో భాగంగా పులుకుర్తి గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణ పనులకు సోమవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ పెంచల స్వరూప గారు నూతన భవన నిర్మాణానికి సంబంధించి సంప్రదాయబద్ధంగా ‘ముగ్గు పోసి’ పనులను ప్రారంభించారు. గ్రామస్తుల చిరకాల కోరికైన సొంత పంచాయతీ భవన నిర్మాణం ప్రారంభం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సకల వసతులతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు, అధికారులు గ్రామ కార్యదర్శి, కారోబార్, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్/భూపాలపల్లి:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందే దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసి కార్యాలయంలో నిర్వహించిన ‘ప్రజావాణి’లో ఆయన స్వయంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి ఈరోజు మొత్తం 44 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. అందిన దరఖాస్తులను తక్షణ చర్యల నిమిత్తం ఆయా శాఖల అధికారులకు అక్కడికక్కడే ఎండార్స్‌మెంట్ చేసి అప్పగించారు. ఈ వారం అందిన ఫిర్యాదులు వచ్చే వారం ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. “దూర ప్రాంతాల నుంచి ప్రజలు ఎంతో ఆశతో వచ్చి సమస్యలను విన్నవించుకుంటున్నారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. దరఖాస్తుల పరిష్కారంలో ఎవరైనా నిర్లక్ష్యం వహించినా లేదా పర్యవేక్షణ లోపించినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటాం” అని కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాలలో నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు, సర్పంచులకు ఎంపీడీఓ మాలోత్ శంకర్ సూచించారు. ఈ మేరకు పర్వతగిరి ఎంపీపీ కార్యాలయంలో గ్రామ సర్పంచులు, మిషన్ భగీరథ ఏఈలు, పంచాయత్ కార్యదర్శులతో సమీక్ష జరిపారు. గ్రామాలలో ఉన్న చేతి పంపులను మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో హైరింగ్ కోసం బావులను ముందుగానే గుర్తించి సిద్ధం చేయాలని ఎంపీడీఓ సూచించారు. అనంతరం ఇటీవల ఎన్నికైన సర్పంచులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శేశాంజన్ స్వామి, గ్రిడ్ ఏఈ హరీష్, ఇంట్రా ఏఈ అరుణ్, పీఆర్ ఏఈ కవిత, హౌసింగ్ ఏఈ ఉదయచంద్ర, ఈజీఎస్ ఏపీఓ సుశీల్, ఈసీ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ చైర్మన్ ను కలిసిన డీబీఎఫ్ నేత

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను రాష్ట్ర దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ హనుమకొండలో మర్యాదపు పూర్వకంగా కలిశారు. హనుమకొండలో ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశానికి చైర్మన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వీరు ఇరువురు రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలకు జరుగుతున్న అన్యాయాలు, అత్యాచారాలపై కమిషన్ స్పందించిన తీరును డీబీఎఫ్ నేత ప్రశంసించారు. అనేక ఏడ్లుగా దళితుల సమస్యలు ఎక్కడ వేసిన గోగాడి అక్కడే ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు చైర్మన్ చేసిన కృషిని అభినందించారు. అణగారిన వర్గాల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వెంకటయ్య కృషి మరువలేనిదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లం రాజకుమార్, బిగుళ్ల సురేష్, మాస్టర్ జి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



## అచల చిట్ ఫండ్ బాధితులకు ఊరట

### రూ.3.67 కోట్ల చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అచల చిట్ ఫండ్ సంస్థలో సభ్యులుగా చేరి ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అండగా నిలిచింది. సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ ఆధ్వర్యంలో సోమవారం 79 మంది లబ్ధిదారులకు రూ.3,67,27,224 విలువైన నగదు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. చిట్ ఫండ్ సంస్థల వల్ల నష్టపోయిన బాధితులకు రాష్ట్రవ్యాప్తంగా మొట్టమొదటిసారిగా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా వారు చెల్లించిన డబ్బును తిరిగి ఇప్పించడం జరిగిందని పేర్కొన్నారు. చిట్ ఫండ్ సంస్థలు ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి, చట్ట పరిధిలో తమ కార్యకలాపాలు సాగించాలని హితవు పలికారు. సామాన్యుల ఆర్థిక ఇబ్బందులను తగ్గించడం, బాధితులకు తగిన పరిహారం అందించి న్యాయం చేకూర్చడమే న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎం. సాయికుమార్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ సాగింది. మధ్యవర్తిత్వ న్యాయవాది తీగల జీవన్ గౌడ్ బాధితుల పక్షాన మరియు యాజమాన్యం పట్ల పారదర్శకంగా వ్యవహరించి ఈ పరిష్కారాన్ని సాధించారు. తమ కష్టార్జితం తిరిగి లభించడంపై బాధితులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల హక్కుల పరిరక్షణకు న్యాయ సేవాధికార సంస్థ కట్టుబడి ఉందని మరోసారి నిరూపితమైందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎం. సాయికుమార్, బాధితుల తరపున న్యాయవాది వై.విశ్వేశ్వర రావు, అచల చిట్ ఫండ్ తరపున సీనియర్ న్యాయవాది చొల్లేటి రామకృష్ణ, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసరావు, చిట్ ఫండ్ సంస్థ చైర్మన్ పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

**◆ హనుమకొండ డీపీఓకు టీయూసీఐ వినతి**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలను శుభ్రం చేస్తూ ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుతున్న గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ అనుబంధం) నేతలు పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ రాజ్ అధికారి ఎల్.లక్ష్మీ రమాకాంత్ ని కలిసి పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 12,732 గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న సుమారు 60 వేల మంది కార్మికులకు డిసెంబర్, జనవరి నెలల జీతాలు వెంటనే చెల్లించాలి. కొన్ని జిల్లాల్లో 4 నెలలుగా జీతాలు రాక కార్మికుల కుటుంబాలు పస్తులుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా, జీవో 60 ప్రకారం కేటగిరీల వారీగా విభజించి వేతనాలను పెంచాలి. చట్టప్రకారం ప్రతి కార్మికుడికి పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కల్పించాలి. మల్టీపర్పస్ వర్కర్లకు శాపంగా మారిన జీవో 51ని రద్దు చేసి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి. ఈ సందర్భంగా అర్షం అశోక్ మాట్లాడుతూ.. “రాష్ట్ర ప్రభుత్వం ఇతర సంక్షేమ పథకాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది, కానీ నెలకు కేవలం 60 కోట్లు కేటాయిస్తే చెల్లించగలిగే గ్రామపంచాయతీ వర్కర్ల జీతాలను ఎందుకు పెండింగ్‌లో పెడుతోంది? రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులను ఆదుకోవాలి.” తమ డిమాండ్లు నెరవేర్చని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కార్మికులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా నాయకులు ఎస్.అంకుష్, పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, నాయకులు ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ది ప్యారడైజ్ నుంచి ప్రోమో సాంగ్ విడుదల



నాని హీరోగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ'. మోహన్‌బాబు కీలకపాత్రలో కనిపించనున్నారు. ఆగస్టు 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దీని మొదటి పాటను విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. తాజాగా 'ఆయా షేర' అనే సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. పూర్తి పాట ఫిబ్రవరి 24న రానుంది. అనిరుధ్ అందించిన సంగీతం జోష్ పెంచేలా కనిపిస్తోంది. ఇదిలావుంటే నేచురల్ స్టార్ నాని వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. 'ది ప్యారడైజ'లో నాని పూర్తిగా కొత్త గెటప్‌లో, ఊర మాస్ క్యారెక్టర్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్ర కోసం ఆయన తన లుక్‌ను పూర్తిగా మార్చుకోవడం విశేషం. రగ్డ్ స్టైల్, ఇంటెన్స్ బాడీ లాంగ్వేజ్‌తో నాని మరోసారి మాస్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తోంది. 'దసరా'లో చూపించిన రా ఎనర్జీకి మించి ఈసారి మరింత పవర్‌ఫుల్ ప్రెజెన్స్ ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.

# ఆరా ఆఫ్ ఉస్తాద్ రెండో పాట విడుదల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గురించి దర్శకుడు హరీష్ శంకర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం మార్చి 26న విడుదల కానుంది. ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.






ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా జరుపుకుంటుంది. ఇందులో భాగంగా 'ఆరా ఆఫ్ ఉస్తాద' అనే రెండో పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీష్ శంకర్ మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. పవన్ కళ్యాణ్ రెండు దశాబ్దాలుగా మెడపై చెయ్యి వేసుకునే మేనరిజాన్ని గుర్తు చేస్తూ, దానికి మాటల రూపం ఇవ్వాలనే ఆలోచనతోనే 'నేను మెడ ముట్టుకుంటే తొడ కొట్టినట్టే' అనే డైలాగ్ వచ్చిందన్నారు. ఈ హుక్ లైన్ చెప్పగానే డీఎస్పీ ఉత్సాహంగా స్పందించారని తెలిపారు. మాస్ హుక్ లైన్‌లో కూడా ఫిలాసఫీ చెప్పొచ్చని దేవిశ్రీ ప్రసాద్ తనకు కాంప్లిమెంట్ ఇచ్చారని చెప్పారు. ఈ పాటను రచయిత చంద్రబోస్ కేవలం రెండు రోజుల్లో ఎనిమిది గంటల్లో రాశారని వెల్లడించారు. ఇది కేవలం అభిమానంతో రాసిన పాట కాదు. పవన్ కళ్యాణ్ లైఫ్ స్టైల్, ఆయన జర్నీపై అవగాహనతో వచ్చిన పాట. ఆయన వ్యక్తిత్వం, కష్టపడే స్వభావం ఈ పాటలో ప్రతి లైన్‌లో కనిపిస్తుంది. సినిమాల్లో కానీ, రాజకీయాల్లో కానీ ఆయనకు విజయాలు రాత్రికి రాత్రే రాలేదు. ఆ ప్రయాణం మొత్తం ఈ పాటలో వినిపిస్తుంది' అని హరీష్ శంకర్ అన్నారు. అభిమానులు పవన్ కళ్యాణ్‌కు పాలాభిషేకం చేస్తారని, కానీ దేవిశ్రీ ప్రసాద్ ఈ పాటతో పాటాభిషేకం చేశారని, చంద్రబోస్ తన సిరాతో సిరాభిషేకం చేశారని ఆయన పేర్కొన్నారు. అయితే పవన్ కళ్యాణ్ డబ్బుకి ఏమాత్రం లొంగని వ్యక్తి అని హరీష్ శంకర్ స్పష్టం చేశారు. 'గబ్బర్ సింగ' తర్వాత అనేక మంది నిర్మాతలు, కార్పొరేట్ సంస్థలు సినిమాలు, యాడ్స్ కోసం సంప్రదించారని తెలిపారు. 2012లోనే పాన్ ఇండియా అనే పదం లేకపోయినా, ఒక యాడ్ కోసం షారుఖ్ ఖాన్ తీసుకునేంత రెమ్యూనరేషన్‌ను పవన్ కళ్యాణ్‌కు ఆఫర్ చేశారని చెప్పారు. అయితే ఆరోగ్యానికి హానికరమైన లేదా చిన్నపిల్లలకు మంచిది కాని ఉత్పత్తులకు ప్రచారం చేయడం ఇష్టం లేక ఆయన కొన్ని కోట్ల రూపాయల యాడ్స్‌ను తిరస్కరించారని వెల్లడించారు. ఇక సినిమాలో సాంగ్స్, డాన్స్, డైలాగ్స్, ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్, డ్రెస్సింగ్ స్టైల్, హెయిర్ స్టైల్ అన్నీ ఉంటాయి. 2 గంటల 35 నిమిషాల సినిమాలో దాదాపు 2 గంటలు పవన్ కళ్యాణ్‌ను తృప్తి చూస్తారు' అని హరీష్ శంకర్ నమ్మకం వ్యక్తం చేశారు.

# పెళ్లికోసం ఉదయ్‌పూర్‌కు విజయ్

టాలీవుడ్ క్రేజీ జంట విజయ్ దేవరకొండ రష్మిక మందన్నా పేర్లు గత కొద్ది రోజులుగా నెట్టింట హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. వీరిద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ నడుస్తుందని ప్రచారం జరుగుతున్న వేళ ఎట్టకేలకు వధూవరులుగా పెళ్లిపీటలు ఎక్కబోతున్నారు. ప్రేమ, పెళ్లిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన తరువాత పెళ్లి వేడుకల సందడి మొదలైంది. ఈ నెల 26న వివాహం జరగనుండగా, వేడుక కోసం ఈ జంట రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు బయల్దేరింది. ఎయిర్‌పోర్ట్‌లో కనిపించిన వీరి వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్ వెంట ఆయన సోదరుడు ఆనంద్ దేవరకొండ ఉన్నారు. ఇప్పటికే ఉదయపూర్ ప్యాలెస్‌లో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వివాహం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. గత కొంతకాలంగా వీరి ప్రేమ, పెళ్లిపై వార్తలు జోరందుకున్నాయి. సోషల్ మీయాలో ఒకే పోస్ట్‌తో పెళ్లి విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అభిమానులు ప్రేమగా పిలిచే 'విరోష' పేరునే తమ వివాహానికి శీర్షికగా పెట్టామని పేర్కొన్నారు. మీరు ప్రేమగా పెట్టిన పేరు 'విరోష'. మీ అందరి ఆశీర్వాదాలతో జంటగా మీ ముందుకు వస్తున్నాం. 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష'' అంటూ ఎమోషనల్‌గా రాసుకొచ్చారు. ఉదయపూర్‌లో పెళ్లి అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. అభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ కలల కపుల్ పెళ్లి వేడుక సోషల్ మీడియాలో మరింత సందడి చేయనుంది.









# అల్లువారింట పెళ్లి సందడి

## పవన్, నాగబాబు దంపతులకు ఆహ్వానం

అల్లు వారింట పెళ్లి పనులు ఫుల్ జోష్‌లో జరుగుతున్నాయి. ఒకవైపు పసుపు దంచే కార్యక్రమాలు.. మరోవైపు బ్యాచిలర్ పార్టీలతో కొన్ని రోజుల నుంచి శిరీష్`నయనికల ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్సీ నాగబాబును పెళ్లికి ఆహ్వానించారు. సతీ సమేతంగా పవన్ కల్యాణ్, నాగబాబుల ఇళ్లకు వెళ్లిన అల్లు అరవింద్.. వారికి నూతన వస్త్రాలు అందించి పెళ్లికి పిలిచారు. మార్చి 6న అల్లు శిరీష్`నయనిక ఒకటి కానున్నారు. ఈ వేడుకకు ఇప్పటికే చిరంజీవికి ఆహ్వానం అందిన విషయం తెలిసిందే. ఇటీవలే పసుపు దంచే కార్యక్రమం జరిగింది. ఆ ఫొటోలను అల్లు అర్జున్ సతీమణి స్నేహ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. హైదరాబాద్‌లోనే వీరి పెళ్లి జరగనున్నట్లు తెలుస్తోంది. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు ఈ వేడుకకు హాజరవుతారని సమాచారం. ఇక ఇటీవలే దుబాయ్‌లో ఫ్రెండ్స్ సర్కిల్‌కు బ్యాచ్‌లర్ పార్టీ ఇచ్చారు. అక్కడి నుంచి వచ్చాక ఫిబ్రవరి 20న అల్లు అర్జున్ హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులకు, టాలీవుడ్ నటీనటులకు పార్టీ ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో రామ్ చరణ్ దంపతులతో పాటు శ్రీలీల, మృణాల్, ఫరియా అబ్దుల్లా మరికొందరు సందడి చేశారు.



# రోడ్డు ప్రమాదాల్లో యువతను కోల్పోతున్నాం

- వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్
- క్రీడల్లో రాణించిన పోలీస్ క్రీడాకారులకు ఘన సన్మానం

**వరంగల్ వాయిస్, క్రైం :** రహదారి నిబంధనలు పాటించకపోవడంతో ఎంతో భవిష్యత్ ఉన్న యువత రోడ్డు ప్రమాదాలబారిన పడి మద్యంతరంగా జీవితాలను ముగించాల్సి వస్తుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి నెల చివరి వారం నిర్వహించే 'అరైవ్ అలైవ్' రెండో విడత కార్యక్రమములో భాగంగా సోమవారం వరంగల్ ట్రాఫిక్ పోలీసుల అధ్వర్యంలో హనుమకొండలోని వాగ్దేవి కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతి వాహనదారుడు పాటించాల్సిన ట్రాఫిక్ నిబందనలు, వాటిని అతిక్రమిస్తే జరిగే పరిణాలపై వివరించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ వాహనదారులు తగు జాగ్రత్తలను తీసుకుంటూ వాహనం నడపాలన్నారు. అదే విధంగా తన ప్రాణాన్ని కాపాడుకుంటూ ఇతరుల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత వాహనదారుడిపై ఉందన్నారు. థ్రిల్ కోసం వాహనం నడిపితే ప్రణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఇలాంటి చర్యలతో కుటుంబ సభ్యులు ఎంతో నష్టపోతారన్నారు. గత సంవత్సరంలో హత్యలు లేదా ఇతర కారణాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 800 మంది మరణించారన్నారు. కాని రోడ్డు ప్రమాదాల్లో మాత్రం 7,500 మంది మృత్యువాత పడటం బాధాకరమన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనం నడపాల్సిందిగా తెలియజేయాలని పోలీస్ కమిషనర్ విద్యార్థులకు సూచించారు. అనంతరం ట్రాఫిక్ రూల్స్ పాటిస్తామంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమములో సెంట్రల్ డీసీపీ దార కవిత, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారయణ, ఇన్స్‌స్పెక్టర్లు వెంకన్న, సీతరెడ్డి, సుజాత, వాగ్దేవి కళాశాల ప్రిన్స్‌పాల్ శేషాచలం, కరస్పాడెంట్ శ్రవణ్ రెడ్డి హరిచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

### జాతీయ స్థాయిలోనూ రాణించాలి..

సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో పతకాలను సాధించిన వరంగల్ కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులను సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. పతాకాలను సాధించిన క్రీడాకారులను సీపీ వ్యక్తిగతంగా అభినందించారు.

ఈ సందర్భంగా హకీ క్రీడాకారులు సంయుక్తంగా కలసి వరంగల్ పోలీస్ కమిషనర్‌కు హకీ జెర్సీని బహుకరించడంతో పాటు, ఈ రాష్ట్ర స్థాయి క్రీడల్లో టెబుల్ టెన్నిస్ క్రీడలో కాంస్య పతకాన్ని సాధించిన వరంగల్ పోలీస్ కమిషనర్‌కు ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్ చేతుల మీదుగా సీపీ పతకాన్ని అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగే క్రీడల్లో పతకాలను సాధించేందుకుగా ముమ్మరంగా సాధన చేయాలన్నారు. క్రీడల్లో రాణించే వారికి తప్పక సహకారం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమములో డీసీపీలు దార కవిత, అంకిత్ కుమార్, ట్రైనీ ఐపీఎస్ మనిషా నేహా, అదనపు డీసీపీలు సురేష్ కుమార్, రవి, శ్రీనివాస్, ఏసీపీలు నాగయ్య, సురేంద్ర, జితేందర్ రెడ్డి, మధుసూదన్, అంతయ్య, ఆర్ఐలు స్పర్జన్ రాజ్, సతీష్, ఇన్స్‌స్పెక్టర్ శుకూర్, ఆర్ఎస్ఐ శరత్, మణి కృష్ణ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గోన్నారు.



# కనువిందు చేసిన 'చిత్ర కళా సంత'

- 436 మంది బాల కళాకారుల ప్రతిభ
- ప్రతి చిన్నారికి గోల్డ్ మెడల్, ట్రోఫీలతో సన్మానం

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తూ సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన "సాగంటీస్ ఆర్ట్ ఛాలెంజ్" ముగింపు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 436 మంది చిన్నారులు పాల్గొన్న ఈ వారం రోజుల ఛాలెంజ్‌లో వారు గీసిన చిత్రాలు, క్రాఫ్ట్ వర్క్ లతో నిర్వహించిన 'చిత్ర కళా సంత' సందర్శకులను మంత్రముగ్ధులను చేసింది. శనివారం వేములవాడ ఎస్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కరీంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మంకమ్మ తోట)లో ప్రదర్శన నిర్వహించగా, ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియంలో భారీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటు చిన్నారులు వేసిన విభిన్న చిత్రాలు, వారు తయారు చేసిన అద్భుతమైన క్రాఫ్ట్ వర్క్‌లను ఒకే చోట ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను వీక్షించడానికి వందలాది సంఖ్యలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కళాకారులు, పుర ప్రముఖులు తరలివచ్చారు. చిన్నారుల ఏకాగ్రతను, వారిలోని అపారమైన ప్రతిభను చూసి వీక్షకులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మంజుల సాగంటి ప్రతి చిన్నారిని కండువాతో సన్మానించి, వారి ప్రతిభకు గుర్తింపుగా సర్టిఫికెట్, ట్రోఫీ, గోల్డ్ మెడల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల వల్ల పిల్లల్లో సృజనాత్మకతతో పాటు ఏకాగ్రత కూడా పెరుగుతుందని, వారిని మరింత ప్రోత్సహించడమే అకాడమీ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు చిప్పకుర్తి శ్రీనివాస్, అకాడమీ సలహాదారుడు నిమ్మల శ్రీనివాస్, హరిప్రసాద్ రావు, హరిప్రియ, ఆర్టిస్టులు శిరీష, దేవిక, జయశ్రీ, రఘుపతి, హేమలత, కవిత, మానస, సంజన, సాయి, వెన్నెల, వర్ష, షైనీ తదితరులు పాల్గొని చిన్నారులను అభినందించారు.



# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

□ అదనపు కలెక్టర్ ఎన్.రవి

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందే వినతులను అధికారులు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన జిల్లా రెవెన్యూ అధికారి వై.వీ.గణేష్‌తో కలిసి ప్రజల నుండి నేరుగా అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితులు తమ సమస్యలపై మొత్తం 165 వినతులను అధికారులకు అందజేశారు. అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. సమాచార హక్కు చట్టం అమలుపై అదనపు కలెక్టర్, డీఆర్ఓ కీలక సూచనలు చేశారు. పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు చట్టం కింద అడిగిన సమాచారాన్ని నిర్ణీత గడువులోగా దరఖాస్తుదారులకు అందించాలి. ఈ కార్యక్రమంలో హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, సీపీఓ సత్యనారాయణరెడ్డితో పాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# ఖాసీం రజ్వీని తలపిస్తున్న రేవంత్ రెడ్డి

- రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోంది
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- అండర్ బ్రిడ్జి ప్రాంతంలో సీఎం దిష్టిబొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిర్మల్‌లో కారులో ప్రయాణిస్తున్న ఓ కుటుంబాన్ని నడిరోడ్డుపై కొందరు దుండగులు అడ్డగించడం .. కనీసం ఆడబిడ్డ అని కూడా చూడకుండా అత్యంత దురుసుగా ప్రవర్తించి, దాడికి తెగబడడం తెలంగాణలో అరాచక పాలనకు అద్దంపడుతోందని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆరోపించారు. ఇంతటి అమానుష ఘటనను యావత్ సమాజం ముక్తకంఠంతో ఖండిస్తున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ, ఆ దుర్మార్గులపై ఇప్పటి వరకు కనీస చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కనీసం పూర్తిస్థాయి హోంమంత్రిని సైతం నియమించకుండా.. శాంతిభద్రతను పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శించారు. సామాన్యుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా ఏమాత్రం పట్టించుకోని రేవంత్ రెడ్డి ప్రభుత్వ మొండి వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. అదేవిధంగా తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావును అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బాన్సువాడలో జరిగిన హింసలో గాయపడిన కుటుంబాలను పరామర్శించడానికి, అలాగే ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకటరమణ రెడ్డిని కలవడానికి వెళ్తున్న రాష్ట్ర అధ్యక్షులను అడ్డుకుని అరెస్ట్ చేసి బొలారం జైలుకు తరలించడం అత్యంత బాధాకరం అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులను ముఖ్యంగా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిని ఈ విధంగా నిర్బంధించడం అనేది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా ప్రబారి కొండపల్లి శ్రీధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, కందిమల్ల మహేష్ బీజేపీ రాష్ట్ర నాయకులు గందె నవీన్ కుమార్, జిల్లా నాయకులు కనుకుంట్ల రంజిత్, ఎరుకుల రఘునారెడ్డి, జిల్లా, మండల పదాధికారులు, వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు, పలు మండలాల అధ్యక్షులు, నాయకులు,

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com